ఓంశ్రీసాయిరాం

విద్యార్థులారా!

ఆకుపచ్చ పక్షులన్ని చిలుకల వలె పలుకునా?
పూవులపై పారాడెడు పురుగులు తుమ్మెదలగునా?
పులిచర్మముగప్పినట్టి గాడిద తా పులియగునా?
ఏనుగంత బలిసియున్న పంది ఏనుగగునటయ్యా?

మానవుడీనాడు తనను తాను గొప్పవానిగా భవించుకుంటున్నాడు. మానవత్వము లేనివాడు మానవుడే కాదు. మానవత్వమును అర్థం చేసుకొని వర్తించుటువంటివాడే నిజమైన మానవుడు. సత్య, ధర్మ, శాంతి, ప్రేమ, అహింసలను ఆచరణలో పెట్టి, అందరికీ బోధించేవాడే మానవుడు. ఇందులో ఏ ఒక్క లక్షణము లేకపోయినప్పటికీ అది అవలక్షణమే! గొప్ప తెలివితేటలు గలవాడు మానవుడు. ఆ తెలివితేటలంతా ఇంతా కాదు. కానీ, ఆచరణలో అవి ఏమాత్రము కనిపించటం లేదు.

ఒకానొక సమయంలో ఈశ్వరుడు తపోదీక్షలో కూర్చొన్నాడు. అతనిని వివాహమాడాలని ఆశించింది పార్వతి. ఈశ్వరుడు ఆమెకు తగినవాడు కాదని నచ్చచెప్పటానికి ఆమె తల్లిదండ్రులు ప్రయత్నించారు.

నీవు బాలవె కద గౌరమ్మా సాంబశివుడు ముసలివాడమ్మా
తలనిండా జడలవాడమ్మా తాను కట్టింది పులిచర్మమమ్మా
ఎద్దు వాహనమెక్కుతాడు ఏ ప్రొద్దూ తిరుగుచుండువాడు
పుట్టలోని పాములు చుట్టుకున్నాడమ్మా
గుట్టు తెలియక నీవెట్లు వరించితివి?
ఒక ఇల్లు లేదు, వాకిలి లేదు, ఒలుకుల్లో పండుకుంటాడు.

వారికి పార్వతి ఏమీ సమాధానం చెప్పలేదు.పార్వతి తత్త్వము ఈశ్వరుని కెఱుక. ఈశ్వరుని తత్త్వము పార్వతి కెఱుక. ఇరువురూ వేరువేరు కాదు, ఒక్కటే. శివశక్త్యాత్మక స్వరూపుడు ఈశ్వరుడు. శివశక్త్యాత్మక స్వరూపమే పార్వతి. ఇటువంటి నిగూఢమైన తత్త్వాన్ని సామాన్యులు ఏవిధంగా అర&తం చేసుకోగలరు! ఎక్కడ ద్వైతభావము వుంటుందో అక్కడే సందేహము వస్తుంది. A man with dual mind is half blid. కాని, వీరిద్దరికికూడను ద్వైతభావము లేదు. సరస్వతి వచ్చి, 'అమ్మా! పార్వతీ! భర్త ఒకవిధంగా, భార్య ఇంకొకవిధంగా వుండటాన్ని సమాజము ఒప్పుకోదు. నీవు సర్వజ్ఞురాలవు, సర్వవ్యాపివి, సర్వశక్తిమంతురాలవు. అన్నీ తెలిసి నీవు భ్రాంతిలో మునిగినావే!' అన్నది. అప్పుడు పార్వతి, 'సరస్వతీ! నాలో ఈశ్వరాసక్తి మాత్రమే వుంటుంన్నది. మరి దేనిపట్లకూడను నాకు ఆసక్తి లేదు. నా నిర్ణయాన్ని ఎవ్వరూ మార్చలేరు' అన్నది.

'ఈశావస్య మిదం సర్వం' ఈశ్వరుని శక్తి సర్వత్రా వ్యాపించినటువంటిది. ఈశ్వరత్వమును ప్రేమించటమే మానవుని ప్రధానమైన కర్తవ్యము. ఈ దివ్యశక్తి ప్రతి వ్యక్తియందు దాగియున్నది. మీ దేహమును మీరు వస్త్రముతో ఏవిధముగా కప్పుకోని వున్నారో ఆవిధముగానే సర్వత్రా వున్న ఈశ్వరత్వమునకు మాయ తెర అడ్డుగా వున్నది. అందువల్లే అది మన కంటికి గోచరించటం లేదు. 'ఈశ్వర స్సర్వ భూతానాం, ప్రతి ఒక్కరియందుకూడను ఈశ్వరత్వమే వున్నది. ఈశ్వరత్వము వయస్సుకు అతీతమైనది. వేషభాషలకు ఏమాత్రము సంబంధించినది కాదు' అని చెప్పింది పార్వతి.

లక్ష్మికూడా వచ్చి పార్వతితో, 'అమ్మా! నీవు చాలా అందమైనదానవు. గొప్ప శక్తిసామర్థ్యములు గలదానవు. ఇటువంటి నీవు ఇంటింటికీ తిరుగుతూ భిక్షమెత్తేవానిని భర్తగా వరించటము న్యాయం కాదు' అన్నది. అప్పుడు పార్వతి, 'నా భర్త భిక్షగాడు కాదు. ప్రపంచమునకే భిక్షము పెట్టేటువంటివాడు. అతనిని నిందించటం మీబోటివారికి మంచిది కాదు' అని చెప్పింది.

మరికొంధరు దేవతలు వచ్చి పార్వతిని ప్రశ్నించారు. 'పుట్టలోని పాములు చుట్టుకున్నాడమ్మా. గుట్టు తెలియక నీవెట్లు వరించితివి?' పాములకు పంటియందు మాత్రమే విషము వుంటుంది. కానీ, ఈనాటి మానవునికి నిలువెల్లా విషమే! చూపులో విషము, వినికిడిలో విషము, పనులలో విషము! ఈవిధంగా నిలువెల్లా విషము నింపుకున్న వానిని మీరు మంచివాడని భావిస్తున్నారు. పాముకున్న రెండు కోరలు తీసివేస్తే అది ఎవ్వరికీ హాని చేయలేదు. కానీ, నేటి మానవుడు అహంకార, మమకారములనే రెండు విషపు కోరలు పెట్టుకొని ప్రపంచమంతా ధైర్యంగా సంచరిస్తున్నాడు. తాను గొప్పవాడనని భావిస్తున్నాడు. తనయందున్న అహంకార మమకారములను విషపు కోరలుగా భావించుకొనక వాటిని ఏమొతతుల్యంగా భావిస్తున్నాడు. ఇది చాలా పొరపాటు.

తన కలిమి భంగ పుచ్చును
తనకుంగల గౌరవంబు దగ్ధము చేయున్

తన వారల కెడ సేయును

జనులకు గర్వంబు వలన సర్వంబు చెడున్.

అట్టి విషమును ఈనాటి మానవుడు తన ఒళ్ళంతా నింపుకున్నాడు. ఇట్టి మానవత్వాన్ని ఏవిధంగా చక్కచేయగలము!

భగవంతుని సర్వులూ ప్రేమిస్తుంటారు. ప్రతి మానవుడుకూడను ప్రేమచేతనే జీవిస్తున్నాడు. ప్రేమ లేనటువంటి మానవుడు మానవుడే కాదు. భగవంతునికి, మానవునికి మధ్య వున్న ప్రేమ తండ్రీబిడ్డల ప్రేమ. ఇట్టి పవిత్రమైన ప్రేమతత్త్వానికి అపార్థములు కల్పించటం ఎవరి తప్పు? సమాజంలో చోటుచేసుకున్న దుర్గుణముల ప్రభావమే ఇది. లైలా మజ్నుల పవిత్రమైన ప్రేమతత్త్వాన్ని సరిగా అర్థము చేసుకొనలేక జనులు పిచ్చిపిచ్చి భావములకు చోటిస్తూ వచ్చారు. ఒక దినము లైలా చెప్పింది, విషమాటె ప్రేమ మసి ఆయె మనసు, ఏవిధముగా భరియింతునో....' ప్రేమ విషముగా మారకూడదు. మనస్సు ప్రేమమయం కావాలేగాని, విషయవాసనలు పెంచుకొని విషంగా మారిపోకూడదు. మనస్సు ప్రేమమయమైనప్పుడే మనము సుఖాన్ని పొందుతాము.

సమాజములో వున్నటువంటి ప్రతి వ్యక్తికూడను దైవత్వముతో కూడినవాడనే సత్యాన్ని గుర్తించి వర్తించినప్పుడు మనకు భేదములు ఏమాత్రమూ కనిపించవు. అందరియందుకూడను మనం దివ్యత్వాన్ని దర్శించాలి. అప్పుడు ఎవ్వరికీ ఏవిధమైన భేదములూ సంభవించవు. అందరుకూడను ఒక్కటే! all are one, be alike to everyone. ఈవిధముగా మనము సరియైన మార్పును తెచ్చుకోవాలి. మీరు అనేక గ్రంథాలు చదువుతున్నారు. చదివినటువంటివాటిలో సత్యాన్ని మీరు గుర్తించాలి. 'నేను' అనే దివ్యత్వం ప్రతి ఒక్కరియందు వున్నది. 'నేను' అనగా బ్రహ్మ కాదు. విష్ణువు కాదు. ఈశ్వరుడు కాదు. 'నేన నేనే' బ్రహ్మ, విష్ణువు, ఈశ్వరుడు అనేవి పెట్టిన పేర్లేగానీ, పుట్టిన పేర్లు కావు. మానవుడు గుర్తుకోసం పేర్లు పెట్టుకొంటున్నారు. కానీ, పేర్లు ప్రధానం కాదు. బ్రహ్మ సృష్టికర్తయని, విష్ణువు రక్షణకర్తయని, శివుడు లయకర్త అని భావిస్తున్నాము. ఎవరెవరి భావములను పురస్కరించుకొని వారికి ఆయా రూపములలో భగవంతుడు దర్శనమిస్తుంటాడు.

ఒక పర్యాయం శివపార్వతులు ఆకాశ మార్గాన సంచరిస్తూ వుండగా ఒక వ్యక్తి చెట్టుపైకెక్కి తాను కూర్చున్న కొమ్మను తానే నరుక్కుంటున్న దృశ్యము వారికంటబడింది. కొంతసేపటిలో అది విరిగి పడిపోయేటట్లుంది. అది గమనించి పార్వతి ఈశ్వరునితో, 'నాథా! వీడు క్రింద పడిపోకుండా రక్షించండి' అని ప్రార్థించింది. 'పార్వతీ! మొదట చూసిన దానవు నీవు. అతడు క్రింద పడిపోతే మరణిస్తాడన్న విషయం నీకే అర్థమైంది. కాబట్టి, అతనిని రక్షించవలసిన బాధ్యత నాదే' అన్నాడు ఈశ్వరుడు. అప్పుడేమె, 'స్వామీ! ఎవరైనా క్రింద పడినప్పుడు 'అమ్మా' అనో లేక 'అప్పా' అనో అరుస్తారు. 'అమ్మా' అని అరుస్తే నేను రక్షిస్తాను. 'అప్పా' అని అరుస్తే మీరు రక్షించావి' అన్నది. ఈశ్వరుడు 'సరే' అన్నాడు. కొద్దిసేపటికి కొమ్మ విరిగింది. వాడు క్రిథ పడ్డాడు. అమ్మ రెడీగా వున్నది రక్షించటానికి. అప్ప కూడా సిద్ధంగా వున్నాడు. కానీ, వాడు 'అమ్మా' అనలేదు, 'అప్పా' అనలేదు. 'అయ్యో' అన్నాడు. శివపార్వతులిద్దరూ వానిని రక్షించటానికి కాచుకొని వుండినప్పటికీ వాని నోటినుండి ఆ పదములు రాలేదు. కనుక, తల్లిదండ్రులను మనం ఎప్పుడూ జ్ఞప్తియందు వుంచుకోవాలి.

'మాతృదేవో భవ, పితృదేవో భవ, ఆచార్యదేవో భవ, అతిథిదేవో భవ'. నీవు గొప్ప విద్యావంతుడివి కావచ్చు, ఈ ప్రపంచములో వున్న సమస్త విద్యలందు ఆరితేరియుండవచ్చు. కానీ, తల్లికి నీవు కుమారుడవే! తల్లి దీవెనలు ఎప్పుడూ నీ ఇంటనే, వెంటనే, జంటనే వుంటున్నాయి. అట్టి తల్లిని మరచిన తనయుని జీవితం వ్యర్థం, రక్షిచేటువంటి దయార్ద్ర హృదయం ఒక్క పార్వతీకి మాత్రమే వుంటున్నది. ఈశ్వరుడు తండ్రి, శక్తిస్వరూపిణియైన పార్వతియే తల్లి ఈశ్వరుడు అంత స్వేచ్ఛగా ముందుకు పోవటానికి వీల్లేదు. శక్తి ముందు అడుగు పెట్టినప్పుడే ఈశ్వరుడు వెనుక వస్తాడు. మొట్టమొదట శక్తిస్వరూపిణిని ఆరాధించాలి. ఆమెయే తల్లి. కనుకనే మొట్టమొదట 'మాతృదేవో భవ' అన్నారు. తల్లికే ప్రథమ స్థానము అందించబడింది. మన స్వదేశమునుకూడను తల్లితో పోల్చుకుంటున్నాము. India is my motherland అంటారేగానీ fatherland అని ఎవ్వరూ అనరు.

తల్లి మరణించినా ఆమె soul మాత్రం నిరంతరం బిడ్డలపైనే వుంటుంది. ఒక దినము ఒక తల్లి వచ్చి, 'స్వామీ! నా కుమార్తె అందరి మాటలను వింటుంది. కానీ, తమ మాటలకే ఆమె ప్రాధాన్యత నిస్తుంది. మొదటినుండికూడను నా బిడ్డకు మొండితనము మెండు. నేనెన్ని చెప్పినా వినదు. మీరు ఒకతూరి చెబితే వింటుంది. మీరు చెప్పిన మాటను జవదాటదు' అన్నది. ఈరీతిగా తల్లులు వచ్చి దైవాన్ని ఎన్నోరకములుగా ప్రార్థిస్తుంటారు. తల్లికి మించిన దైవము లేదు. కాబట్టి, తల్లిని మనమెన్నటికీ మరువకూడదు. తల్లిని మరచిన వానికి అనేక రకములైన కష్టములు కలుగుతుంటాయి. తల్లిని గౌరవించాలి. ప్రేమించాలి. వారికి తగిన కృతజ్ఞత చూపాలి. సేవలు చేయాలి. అప్పుడే స్త్రీ, పురుషులు వున్నత స్థితిని చేరుకోగలరు. మీరెంత గొప్పవారైనప్పటికీ, ఐ.ఎ.ఎస్. ప్యాసైనప్పటికీ తల్లి మాటను ప్రాణసమానంగా భావించాలి.

పెండ్లి అయిన తర్వాత ఆడవారు అత్తవారింటికి వెడతారు. అత్తగారిని ఆంగ్లంలో mother-in-law అంటారు. ఈ ప్రపంచమున

కంతటికీ mother-in-love పార్వతి. law అనేది ప్రపంచానికి సంబంధించినదయితే love హృదయానికి సంబంధించినది. కనుక, ప్రేమను పెంచుకోండి. ప్రేమయే మీ సర్వస్వంగా భావించుకోండి. అప్పుడే మీరు సరైన జీవితాన్ని గడిపినవారౌతారు. తల్లి ఎంత పిచ్చిదైనా కావచ్చు, ఎంత శక్తిహీనురాలైనా కావచ్చు , కానీ, తల్లి తల్లియే! ఆమె శక్తిహీనురాలైనదికదా అని ఆమెను మీరు విస్మరించి పోకూడదు. తల్లి ఎప్పటికికూడను ప్రేమతో నిండి వుంటుంది. కనుకనే, భక్త రామదాసుకూడా, 'అమ్మా సీతమ్మతల్లీ! నీవు రామునితో చెప్పి నాకు సహాయము చేయించు. మీరిరువురూ చేరి మాట్లాడుకుంటున్న సమయములో నా విషయాన్ని కొంచెం రాముని చెవిలో వేయి' అని ప్రార్థించాడు. రామదాసు తహసీల్దారుగా పని చేసేవాడు. 'స్వామీ! నేను వసూలు చేసిన డబ్బంతా నీకే అర్పితం చేశాను' అంటూ అతను ఈ పాట వ్రాశాడు.

లక్ష్మణునకు చేయిస్తి బంగారు మొలత్రాడు రామచంద్రా!
ఆ మొలత్రాటికి పట్టె పదివేల వరహాలు రామచంద్రా!
సీతమ్మకు చేయిస్తి చింతాకు పతకము రామచంద్రా!
ఆ పతకమునకు పట్టె పదివేల వరహాలు రామచంద్రా!
కలికితురాయి నీకు కుదురుగ చేయిస్తి రామచంద్రా!
ఎవడబ్బ సోమ్మని కులుకుతు తిరిగెదవు!

అహంకార మమకారములను వీడనంతవరకు దేనినీ మనము సాధించలేము. వినయవిదేయతలతో దేనినైనా సాధించవచ్చు. నైతిక, భౌతిక, ధార్మిక, ఆధ్యాత్మిక, రాజకీయ రంగములన్నింటియందుకూడను మనం భక్తితో, వినయవిధేయతలతో వుండాలి. అప్పుడే అన్నింటికీ ఒకవిధమైన కళ చేకూరుతుంది.

కలకత్తాకు సమీపములోని ఒక గ్రామంలో ఈశ్వరచంద్ర విద్యాసాగర్, అతని తల్లి నివసించేవారు. ఆ తల్లి ఎంతో కష్టపడి కుమారుని పోషిస్తూ వచ్చింది. ఇంట్లో దీపం లేకపోవటంచేత విద్యాసాగర్ రాత్రిపూట వీధి దీపాల దగ్గర కూర్చొని చదువుకొనేవాడు. ఈవిధంగా అతను రాత్రింబవలు కష్టపడి చదివి ఉన్నత స్థితికి వచ్చాడు. గొప్ప వ్యక్తిగా పేరు పొందాడు. అతని ఉపన్యాసాలు వినటానికి ప్రజలు వేల సంఖ్యలో ప్రోగయ్యేవారు.

ఒక పర్యాయం విద్యాసాగర్ ట్రైనులో ప్రయాణమై వేరే ఊరికి వెళ్ళాడు. ఆరోజున ఊర్లో ఏర్పాటైన ఒక కార్యక్రమంలో ఆయన ప్రసంగించవలసి వుండినది. ఆయనతోబాటు ఒక ఐ.సి.ఎస్. ఆఫీసరు ఒక చిన్న సూట్‌కేస్ పట్టుకొని స్టేషన్‌లో దిగాడు. దిగుతూనే ఆ ఆఫీసరు తన పెట్టె మోయటానికి ఎవరైనా కూలీ దొరుకుతాడేమోనని చూస్తున్నాడు. ఆయన 'కూలీ, కూలీ' అని అరుస్తుంటే విద్యాసాగర్ వెళ్ళి, 'సార్, ఆ పెట్టె నాకివ్వండి. నేను మోస్తాను. మీరెక్కడికి వెళ్లాలి?' అని అడిగాడు. 'నేను ఈశ్వరచంద్ర విద్యాసాగర్ ఉపన్యాసం వినటానికి వెడుతున్నాను' అన్నాడా ఆ అధికారి. ఆ మాటలు విని విద్యాసాగర్ నవ్వుకొని ఆ పెట్టె పట్టుకొని బయలుదేరాడు. సమావేశం జరిగే చోటికి వెళ్ళిన తరువాత విద్యాసాగర్ అతనికి సూట్‌కేసును అందజేయగా, 'ఇదుగో, ఈ డబ్బు తీసుకో'అంటూ ఆ ఆఫీసరు కొంత డబ్బు ఇవ్వబోయాడు. అప్పుడు విద్యాసాగర్, 'అయ్యా! నేను ఈ పని సేవాభావంతో చేశానుకానీ, డబ్బుకోసం కాదు' అనిచెప్పి వెళ్ళిపోయాడు.

సమావేశంలో అందితోబాటు ఈ ఐ.సి.ఎస్. ఆఫీసరు కూడా కూర్చున్నాడు. విద్యాసాగర్ వేదికపైకి వస్తూనే అతనికి పూలమాలలు వేసి స్వాగతం పలికారు. రైల్వే స్టేషనునుండి తన సూట్‌కేసును మోసుకొని వచ్చిన వ్యక్తి అతడేనని గుర్తించి ఆ ఐ.సి'ఎస్. ఆఫీసరు తాను చేసిన పనికి సిగ్గుపడ్డాడు. సభ ముగియగానే వెళ్ళి విద్యాసాగర్ పాదాలపైబడి క్షమాపణ కోరాడు. విద్యాసాగర్‌యొక్క వినయ విధేయతలే అతనికి అంత గౌరవాన్ని తెచ్చిపెట్టాయి. ఈనాటికికూడా అతని చరిత్రను మీరు పుస్తకాల్లో చదువుతుంటారు. మనం చదివే చదువులో లేదు గొప్పతనం. మన వినయ విధేయతలే మనకు గొప్పతనాన్ని కలిగిస్తాయి. లోకములో ఎంథరో విద్యావంతులున్నారు. కాని, ఏమి ప్రయోజనం? అహంకార మమకారముల వలననే మానవుడు చెడిపోతున్నాడు. ఈ రెండింటినీ త్యజించినప్పుడే మనము గొప్పవారము కాగలము.

ఒక పర్యాయము ఆదిశంకరులవారు మండనమిశ్రుడనే ఒక గొప్ప పండితునితో వాదము వేశారు. మండనమిశ్రుని ధర్మపత్ని ఉభయభారతి. ఆమె సకలజ్ఞానసంపన్నురాలు. అందుచేత, శంకరులవారు తమ ఇరువురిమధ్య జరిగే వాదములో ఎవరు విజయము సాధించేవారనేది నిర్ణయించటానికి ఉభయభారతినే మధ్యవర్తిగా ఎన్నుకున్నారు. ఉభయభారతి తన భర్త ఓడిపోయినాడని శంకరులవారు విజయము సాధించారని తీర్పు చెప్పింది. మండనమిశ్రుడు తాను చేసిన ప్రతిజ్ఞననుసరించి సన్యాసము స్వీకరించాడు. అతని అర్థాంగి ఉభయభారతికూడా సన్యాసము స్వీకరించింది. ఆమె ఒక ఆశ్రమమును నిర్మించుకొని, స్త్రీలకు జ్ఞానబోధలు సల్పుతూ వచ్చింది. ఒకనాడు ఆమె తన శిష్యురాండ్రను వెంటబెట్టుకొని గంగానదికి వెడుతున్నాది. మార్గమధ్యంలో ఒక చెట్టు క్రింద ఒక సన్న్యాయసి తన నీటిబుఱ్ఱను ఎవరైనా దొంగిలిస్తారేమో అన్న భయంచేత తలక్రింద పెట్టుకొని పడుకున్నాడు. అది చూచి ఉభయభారతి

తన శిష్యురాండ్రతో, 'ఆహా! ఇతడు పేరుకు సర్వసంగపరిత్యాగియేగానీ నీటిబుఱ్ఱపైన యింకా అతనికి అభిమానము పోలేదు' అని అతనికి వినబడేలా అన్నది. ఆమె మాటలు అతనికి కోపం చెప్పించాయి. వాళ్ళు గంగలో స్నానంచేసి తిరిగి వస్తుండగా అతడా బుఱ్ఱను తీసి విసిరేశాడు. అప్పుడు ఉభయభారతి, 'ఇతనిలో ఒక్క దోషమే వున్నదనుకున్నాను. కాని, నిజంగా రెండు దోషములున్నవి' అన్నది. ఏమిటా రెండు దోషములు? నీటిబుఱ్ఱను దాచుకోటం అభిమానం, ఉభయభారతి తనను విమర్శించిందనే కోపంచేత దానిని తీసి విసిరివేయటం అహంకారం. 'అభిమాన, అహంకారములను త్యజించనివాడు సర్వసంగపరిత్యాగి కాజాలడు' అన్నది ఉభయభారతి. అప్పుడా సన్యాసి వెళ్ళి ఆమె పాదాలపైబడి తన దోషాలను క్షమించవలసిందిగా కోరాడు. 'నాయనా! ఇప్పుడు నీవు నిజంగా సర్వసంగపరిత్యాగివైనావు' అన్నది ఉభయబారతి.

మహాభారతంలో కర్ణుడికి ఎటువంటి అహంకారమమకారములూ లేవు. మీరు కర్ణుడివంటి వారుగా తయారుకావాలిగానీ దుర్యోధన దుశ్శాసనుల మాదిరి తయారు కాకూడదు. ప్రతి విద్యార్థికూడను ఒక కర్ణుడు మాదిరి కావాలి. చక్కని విషయాలను వినాలి. వాటిని ఆచరణలో పెట్టాలి. ఆనందాన్ని అనుభవించాలి. అనుభవించిన ఆనందాన్ని అందరికీ పంచాలి. ఇదే మీ ప్రధాన కర్తవ్యం.